క్లుప్తంగా

ప్రతి చిన్నారికి ఆధార్ తప్పనిసరి

నాగులుప్పలపాడు: ప్రభుత్వ నిభందనల మేరకు ప్రతి విద్యార్థికి ఆధార్ కార్డు ఉండాలన్న నిబంధనతో ప్రతి పాఠశాల, సచివాలయంలో విద్యార్థులకు అందుబాటులో ఉందని ఎంపీడీఓ మహాలక్ష్మి తెలిపారు. ప్రస్తుతం 0 నుంచి 6 సంవత్సరాల్లోపు చిన్నారులకు నిర్వహిస్తున్న ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమం గురువారం పరిశీలించారు. ప్రస్తుతం మండలంలో కనపర్తి, రాపర్ల, మాచవరం, అమ్మనబ్రోలు గ్రామాల్లో చిన్నారుల కోసం ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నారని ఈ క్యాంపుల్లో కొత్త ఆధార్ కార్డుతో పాటు అప్డేట్ లను ఉచితంగా చేస్తామని తెలిపారు.

ఘనంగా రంగా వర్ధంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఒంగోలు వన్‌టౌన్: వంగవీటి మోహన రంగా 36వ వర్ధంతి నగరంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రామనగర్ 1వ లైన్ వద్ద ఉన్న రంగా విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు. కార్యక్రమానికి కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల సంజీవకుమార్ అధ్యక్షత వహించారు. ముందుగా రంగా విగ్రహం నుంచి నగరంలోని పలు ప్రధాన కూడళ్లలో బైక్ ర్యాలీని నిర్వహించారు. బండారు మదన్, ఎ. వెంకటేశ్, ఎస్. రామ్మోహన్, టి. శ్రీనివాస మూర్తి, సీహెచ్ నారాయణ, ఎం. నారాయణ, ఎల్. సుబ్బారావు పాల్గొన్నారు.

28న టెలికాంపై అవగాహన

గిద్దలూరు రూరల్: స్పందన స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా సహకారంతో పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయ కమిటీ హాల్లో ఈ నెల 28న టెలికాం వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు నిర్వాహకురాలు బి.శారద గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

సూపర్ మోసం

- ఆరు నెలల్లో కనిపించని సూపర్ సిక్స్
- బతకలేకపోతున్న సామాన్యులు
- ఇసుక నుంచి బియ్యం దాకా అంతా దోపిడీ
- ఆకాశాన్నంటుతున్న ధరలు



చీమకుర్తి రూరల్:

సూపర్ సిక్స్ అందుతుందిలే అనుకున్న సంతనూతలపాడు నియోజకవర్గ ప్రజల ఆశలపై కూటమి సర్కారు నీళ్లు జల్లుతోంది. విపరీతమైన హామీలు గుప్పించిన చంద్రబాబు ఇప్పుడు చేతులెత్తేసి హాయిగా పరిపాలన సాగిస్తున్నాడు. సామాన్యులకు అందించే తల్లికి వందనంపై కసరత్తే జరగలేదు కానీ తమ నేతల జేబులు నింపే ఇసుక పాలసీని మాత్రం ఆగమేఘాలపై అమలు చేశారు. అన్నదాత సుఖీభవ లేక రైతులు అల్లాడిపోతున్నారు. కానీ అనుయాయుల ఖజానాలు నింపే మద్యం పాలసీని మాత్రం పట్టాలెక్కించారు. చిరు ఉద్యోగులపై దండెత్తి నచ్చని వారిని ఇళ్లకు పంపించారు. గిట్టని వారిని వెతికి మరీ ఉద్యోగాల నుంచి తొలగించారు. టీడీపీ, జన సేన, బీజేపీ మూకుమ్మడి ప్రభుత్వం హామీలు నిల బెట్టుకోవడంలో ఘోరంగా విఫలమైంది.

అటకెక్కిన చదువులు

కూటమి ప్రభుతం విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసే దిశగా **అడుగులు వేస్తోంది. గత** ఐదేళ్లు నిరాటంకంగా **అందిన సంక్షేమ పథకాలు,** కార్యక్రమాలను పూర్తిగా **నిలుపుదల చేసేసింది.** తల్లికి వందనంపై ఎలాం**టి కసరత్తు చేయలేదు.** సర్కారీ బడుల్లో ఇంగ్లీ**షు మీడియం సీబీ** ఎస్సీ సిలబస్, సబ్జెక్ట్ **టీచర్ కాన్సెప్ట్,** బైజూస్ కంటెంట్ తో **కూడిన 8వ** తరగతి విద్యార్థులకు **ట్యాబ్** పంపిణీ, టోఫెల్ **శిక్షణ,** విధానం, నాడు -నే**డు** ద్వారా పాఠశాలల**కు** కొత్త శోభ, మౌలిక సదుపాయాల కల్పన వంటివి వైఎస్సార్ సీపీ సమర్ధంగా చేసి చూపిస్తే. వాటన్నింటినీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆపేసింది. ఆఖరి దశలో ఉన్న నాడు -నేడు పనులకు నిధులు విదల్చక పోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.

వైఎస్ జగన్ హయాంలో సంక్షేమ పాలన

ఏప్రిల్ నేలలో జగనన్న వసతి దీవెన, జగనన్న విద్యా దీవెన, రైతులకు వైఎస్సార్ సున్నా వడ్డీ, డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ చెల్లింపులు అందేవి. **మే నెలలో వైఎస్సార్** ఉచిత వంటల బీమా, రైతు భరోసా 13,500, మత్స్యకార భరోసా రూ. 10,000 అందేవి. జూన్ నెలలో జగనన్నతోడు, వైఎస్సార్ వాహన మిత్ర, వైఎస్సార్ చేయూత పథకాలు రూ. 10 వేలు అందించారు. జూలై నెలలో జగనన్న విద్యా దీవెన రూ.20 వేలు, వైఎస్సార్ కాపునేస్తం రూ.15, వేలు, జగనన్న విద్యా కానుక పథకాలు అందేవి. ఆగస్టు నెలలో రైతులకు వైఎస్సార్ సున్నా వడ్డీ, ఎంఎస్ఎంఈ పారిశ్రామిక రాయితీలు, వైఎస్సార్ నేతన్న **నేస్తం కింద రూ. 24 వేలు, అగ్రి గోల్డ్** బాధితులకు చెల్లింపులు జరిగేవి.

➤ సెప్టెంబర్ నెలలో వైఎస్సార్ ఆసరా, అక్టోబర్ నెలలో మరో సారి వైఎస్సార్ రైతు భరోసా, జగనన్న **చేదోడు పథకం కింద** నాయీబ్రాహ్మణులకు, టైల**ర్లకు, రజకులకు రూ.10** వేలు అందించారు. నవం**బర్ నెలలో వైఎస్సార్ ఈ**బీసీ నేస్తం అందజేసేవారు. **డిసెంబర్ నెలలో జగన**న్న వసతి దీవెన, విద్యా **దీవెన. వైఎస్సార్ నే**స్తం అందేవి.

➤ **జనవరి** నెలలో మరో సారి వైఎస్సార్ **రైతు భరో**సా, జగనన్న అమ్మఒడి **రూ. 15** వేలు, పింఛన్ పెంపు అం**దేవి.** ఫిబ్రవరి నెలలో జగనన్న **విద్యా** దీవె న అందేవి. కానీ **నేటి** కూటమి ప్రభుత్వం వందలాది పథకాలను తుంగలో తొక్కింది.

నేటి ప్రభుత్వంలో ఆశలు గల్లంతు

ఆరు నెలల పాలనలో రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు అందజేయకపోగా బీమా భారం వేశారు.

➤ ధాన్యం కొనుగోలు విషయంలో సరికొత్త విధానం పేరుతో దళారీ వ్యవస్థను మరింత పదిలం చేస్తూ రైతుల నడ్డి విరిచేశారు. విద్యా సంవత్సరం చివరి దశకు చేరుకుంటున్నప్పటికీ తల్లికి వందనం పథకం ఊసే లేదు.

➤ ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్ర చికిత్సలు చేయించుకోవాలంటే అనేక ప్రయాసలు పడాల్సి వస్తోంది. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని తాకే విధంగా చేశారు.

➤ వసతి గృహాల్లో ఉంటూ ఉన్నత విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు విద్యా దీవెన, వసతిదీవెన చెల్లింపులు నిలిపివేశారు. పాలన వైపు దృష్టి సారించకుండా రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో సామాన్యులు, దళితులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులుతో పేట్రేగిపోయాయి. చిరుద్యోగులపై కక్షపూరితమైన తొలగింపు కుట్రలకు పాల్పడ్డారు.

నాడు చీమకుర్తి మండలంలో కోట్లాది రూపాయల సాయం

వైఎస్సార్ రైతుభరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు

2023- 2024
విత్తనాలు : 1333 క్వింటాళ్లు
రాయితీ మొత్తం: రూ : 42 లక్షలు
ఎరువుల పంపిణీ: 350 టన్నులు

వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు

2019-2024
లబ్ధిపొందిన రైతు కుటుంబాలు: 454
మొత్తం లబ్ధి: రూ:1,83,00,000

వైఎస్సార్ ఉచిత పంటల బీమా

2019-2024
లబ్ధి పొందిన రైతులు: 2402
లబ్ధి: రూ.5,13,00,000

ప్రకృతి వైపరీత్యాలు పంట నష్టపరిహారం

2019-2024
నష్టపోయిన రైతుల సంఖ్య: 1982
పరిహారం : రూ.1,83,00,000

వైఎస్సార్ యంత్రసేవా పథకం కింద

సీహెచ్‌సీ గ్రూపులు, 18
రాయితీ రూ: 1,25,00,000

మహిళలు నమ్మి మోసపోయారు



ప్రభుత్వం వచ్చి ఆరు మాసాలు గడిచిపోయాయి. మహిళలకు ప్రతి నెలా రూ. 1500 ఇస్తామని హామీ ఇచ్చారు. చంద్రబాబు మాటలు నమ్మి మహిళలు మోస పోయారని వాపోతున్నారు. ఆరు నెలలవుతున్నా పథకంపై ఎలాంటి కసరత్తు చేయలేదు.

– **గుణపాటి తిరుపతమ్మ**, రెడ్డి నగర్

ఎలాంటి సాయం అందలేదు



గత ప్రభుత్వంలో రైతు భరోసా, పంట నష్టం బీమా, పొలం వద్దకే వచ్చి పంట కొనుగోలు ఇలా ఎన్నో కార్యక్రమాలు చేశాయి. నాకు రెండు ఎకరాల భూమి ఉంది. నిత్యం సాగుబడిలోనే ఉంటుంది. ఇప్పటి వరకు కుటమి ప్రభుత్వంలో ఎలాంటి సాయం అందలేదు. చంద్రబాబు సూపర్ సిక్స్ లో భాగంగా ప్రకటించిన రూ. 20 వేలు వెంటనే అందించి ఆదుకోవాలి.

– **మనుబ్రోలు సింగరకొండ**, ఇలపావులూరు

ఎదురుచూస్తున్నాం



మా పిల్లలు ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. తల్లికి వందనం కింద రూ..15 వేలు వస్తుందని ఎదురుసూస్తున్నాం. ప్రతి ఇంటిలో ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ ఏడాదికి రూ.15వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ ఆరు నెలలు దాటుతున్నా దీనిపై ఎలాంటి ప్రకటన చేయలేదు.

– **ఉప్పలపాటి సుజాత**, పులికొండ

పెట్టుబడి సాయమేదీ..?



కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడిచినప్పటికీ ఇంతవరకు పెట్టుబడి సాయం కింద రూ. 20 వేలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం. ఇంతవరకు విడుదల చేయలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. అన్నదాత సుఖీభవ నిధులను రైతు ఖాతాలకు జమ చేయాలి. చాలా మంది రైతులు ఈ నిధులు వస్తాయని సాగు పెట్టుబడి కోసం అప్పులు చేస్తున్నారు.

– **బొడ్డు కోటేశ్వరరావు**, మాజీ సొసైటీ ప్రెసిడెంట్, ముప్పవారిపాలెం

వైఎస్సార్ సీపీ పోరుబాట జయప్రదం చేయండి

చీమకుర్తి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం సంతనూతలపాడులో చేపట్టనున్న పోరుబాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున పార్టీ శ్రేణులకు గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని నియోకవర్గ కేంద్రం సంతనూతలపాడులో ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే సర్‌చార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులపై నడ్డివిరిగే విధంగా కరెంటు చార్జీలను అదనంగా మోపుతున్నందుకు నిరసనగా కార్యక్రమాన్ని పోరుబాట పేరుతో చేపట్టినట్లు తెలిపారు. పార్టీ మండల కన్వీనర్‌లు, ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు, మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

వైఎస్సార్ సీపీ నిరసన ర్యాలీ నేడు

మద్దిపాడు: కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచి సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్న నేపథ్యంలో వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు సంతనూతలపాడు మండల కేంద్రంలోని ఎలక్ట్రికల్ ఏఈ కార్యాలయం వద్ద విద్యుత్ చార్జీల పెంపుదలపై కూటమి ప్రభుత్వం నిరంకుశ తీరుపై నిరసన ర్యాలీ, అధికారులకు వినతి పత్రం ఇస్తారని మండల పార్టీ అధ్యక్షుడు మండవ అప్పారావు ఒక ప్రకటనలో తెలియజేశారు. మాజీ మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయ కర్త మేరుగు నాగార్జున, పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ సారథ్యం వహించనున్నారు. నాయకులు, కార్యకర్తలు, ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పోరుబాట విజయవంతం చేయాలి



కొత్తపట్నం: జిల్లా కేంద్రం ఒంగోలులో శుక్రవారం జరిగే పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కలెక్టర్ కార్యాలయం దగ్గర ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం నుంచి విద్యుత్ ఎస్సీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ జరుగుతుందన్నారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

శిథిలావస్థలో తహసీల్దార్ కార్యాలయం



వీఆర్వోల గదిలో టేబుల్ పై పడిన పెచ్చులు



తహసీల్దార్ కార్యాలయం

- ఊడి పడిన శ్లాబు పెచ్చులు.. తప్పిన ప్రమాదం
- భయంగా విధులు నిర్వహిస్తున్న అధికారులు

నాగులుప్పలపాడు: దశాబ్దాల కాలం నాటి భవనాలు కావడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందా అని అధికారులు భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారు. వానలు పడితే ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందో అని ప్రాణాలు అరిచేతిలో పెట్టుకొని విధులు నిర్వహించాల్సి వస్తోంది. నాగులుప్పలపాడు తహసీల్దార్ కార్యాలయం నిర్మాణం చేసి సుమారు 4 దశాబ్దాల వుతోంది. అప్పట్లో చెరువును పూడ్చి నిర్మాణం చేపట్టడంతో నేలలో గట్టిదనం లేక భవనాల జీవిత కాలం చాలా వరకు తగ్గిపోయింది. తహసీల్దార్ కార్యాలయం గోడలు మొత్తం డొల్లగా అవడంతో పాటు శ్లాబు పూర్తిగా దెబ్బతిని చిన్నిపాటి వర్షానికి సైతం నీరు ఒరుస్తోంది. ఇదిలా ఉంటే గురువారం కార్యాలయంలోని వీఆర్వోల గదిలో శ్లాబు పెచ్చులు ఊడి వీఆర్వోలు పనిచేసే టేబుల్ పై పడింది. అయితే ఆ సమయంలో కార్యాలయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. ఇప్పటికైనా ప్రభుత్వం నూతన భవనాలకు అనుమతి ఇచ్చి నిర్మాణం చేయాలని కోరుతున్నారు.



పెచ్చులూడిన శ్లాబు

వణికించిన వర్షం







డిసెంబర్ నెలలో చలి పెరిగిపోతుంటే.. మరో వైపు వర్షం కూడా కురుస్తుండటంతో జనం అల్లాడిపోతున్నారు. గురువారం నగరంలో కురిసిన వర్షానికి జనం వణికిపోయారు. -సాక్షి, ఒంగోలు

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి

పొదిలి రూరల్: విద్యుదాఘాతానికి గురై రెండు గేదెలు మృతి చెందిన సంఘటన పొదిలి మండలంలోని రాజుపాలెం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. రాజుపాలెం గ్రామానికి చెందిన కంచర్ల పెద్ద నాగేశ్వర రావు, కీర్తి ప్రసాద్‌కు చెందిన రెండు గేదెలను మేత కోసం పొలానికి తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో తుళ్లూరి రమణయ్య పొలంలో వర్షానికి తెగి పడి ఉన్న విద్యుత్ వైర్లు తగలడంతో రెండు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. అధికారులు స్పందించి నష్ట పరిహారం ఇప్పించాలని పశు పోషకులు కోరుతున్నారు.

ప్రకటన

నా క్లయింటు **Dodda Koteswari** W/o **వెంకట చలపతిరావు** అన్నవరప్పాడు, ఒంగోలు అనువారి సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయునది.

నా క్లయింటు Canara Bank నందు లోను తీసుకొని క్రింది షెడ్యూలు ఆస్తిని వారి పేరున నా క్లయింట్ మరియు ఆమె కుమారుడు విజయకృష్ణ Reg. Memorandum of deposit of Title Deed Dt 04-08-2023 D.No. 10335/2023 SRO ఒంగోలు Reg చేసినారు. ఈనెల 18-12-2024 పై Document తీసుకొని నా క్లయింటు ఇంటి నుండి బయలుదేరి అన్నవరప్పాడులో Xerox తీసుకొని మంగమూరురోడ్డు Canara Bank - RAH, Ongole వద్దకు పోయి చూసుకొనగా పై Document Original పోయినది. ఎంత వెతికిన దొరకలేదు. కావున ఎవరికైనను దొరికిన యెడల క్రింది అడ్రసుకు 7 రోజులలో తెలుపవలెను అని కోరడమైనది.

షెడ్యూలు: ఒంగోలు మామిడిపాలెం SRO ఒంగోలు విస్తీర్ణము 343.6/9 చ.గజముల Site - in Sy 129/2 - **హద్దులు : తూర్పు :** B. అంజిరెడ్డి, **దక్షిణం :** M. Pranusha పడమర : Road **ఉత్తరం :** T. మునికుమారి

తేది : 26-12-2024

R.V.S భరద్వాజ, లాయర్, ఒంగోలు, 9493781705

వరుస వర్షాలతో వరికి గండం



వర్షానికి కాండం దెబ్బతిన్న వరి పైరు

కొత్తపట్నం: వరుసుగా కురుస్తున్న భారీ వర్షాలకు వరి పైరుకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతుల్లో ఆందోళన మొదలైంది. ఈ ఏడాది వర్షాలు బాగా పడుతున్నాయి నీరు చెరువుల్లో చేరి పంటలు పండుతాయని నమ్మకంతో ఉన్న రైతులకు నిరాశే మిగిలేలా ఉంది. ఉష్ణోగ్రతలు తక్కువుగా ఉండుట వలన పైరు అంతంత మాత్రంగా పెరిగింది. ఎక్కువ రోజులు మేఘాలు ఏర్పడి పైరు కాక పోవడం, కాండం దుబ్బు కట్టకపోవడం, ఎదుగుదల లేక పోవడం వలన వరిలో దిగుబడులు వచ్చే విధంగా లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైరుకు పిచికారీ చేసిన మందులు, భూమిలో వేసిన ఎరువులు, వర్షాలకు బయటకు పోవటంతో పెట్టుబడులు కూడా వచ్చేలా లేని దుస్థితి నెలకొంది. ఉష్ణోగ్రతలు ఎక్కువుగా ఉంటే ఆకులు, కాండం దుబ్బుకట్టి ఎక్కువ దిగుబడులు వస్తాయని, కనుక వర్షాలు ఎక్కువ పడితే తీవ్ర నష్టం వాటిల్లుతుందని భావిస్తున్నారు. గమళ్ళపాలెం, రాజుపాలెం, అల్లూరు రైతులు ఎక్కువ వర్షం పడుట వలన వర్షపు నీరు బయటకు పోక పోసిన వరి నార్లు మునిగి పోతుండటంతో చాలా వరకు కుళ్లిపోయి నష్టం వాటిల్లింది. ఎన్ని ప్రయత్నాలు చేసిన వర్షపు నీరు బయటకు పోవటంలేదని ప్రభుత్వం, రైతులను ఆదుకోవాలని కోరుకుంటున్నారు.



వర్షానికి మునిగిన వరినార్లు

అయ్యప్పకు మండల పూజ



తిరునాభరణ అలంకరణలో అయ్యప్ప స్వామి

ఒంగోలు మెట్రో: స్థానిక మంగమూరు డొంకలో వెలసియున్న శ్రీ హరి హర సుత అయ్యప్ప స్వామి క్షేత్రంలో గురువారం మండల పూజ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు పరాంకుశ కేశవాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి వివిధ రకాల పుష్పాలతో పుష్పాలంకరణ గావించి అయ్యప్పకు తిరునభరణలో దీక్ష స్వాములకు స్వామి దర్శన భాగ్యం కల్పించారు. రాత్రికి దేవస్థానంలో మహా పడిపూజ, స్వామికి పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు.

ఎస్సీ కుల గణనపై సోషల్ ఆడిట్

ఒంగోలు అర్బన్:

ఎస్సీ వర్గీకరణలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్సీ జనాభా వివరాలపై సోషల్ ఆడిట్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం వద్ద ఉన్న ఎస్సీ కులగణన వివరాలను ఈ నెల 26వ తేదీ నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శిస్తామన్నారు. దీనిపై జిల్లాలోని ఎస్సీ పౌరులకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 31వ తేదీ లోపు సచివాలయాల్లో అందించాలని పేర్కొన్నారు. జనవరి 6వ తేది వరకు వచ్చిన అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని చెప్పారు. సమగ్ర వివరాల సేకరణ అనంతరం జనవరి 10వ తేదీ కులగణన తుది వివరాలను సచివాలయాల్లో ప్రదర్శిస్తామని ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసినట్లు తెలిపారు. వచ్చిన అభ్యంతరాలను మూడు దశల్లో తనిఖీ చేస్తామన్నారు. తొలుత వీఆర్‌ఓలు అభ్యంతరాలను పరిశీలించి మండల రెవెన్యూ అధికారికి అందజేస్తారన్నారు. తర్వాత ఆర్ఐ పునఃపరిశీలించి తహసీల్దారుకు నివేదిస్తారన్నారు. ముగ్గురు నివేదికలను పరిశీలించి తుది ఆమోదం తెలిపిన తర్వాత పోర్టల్‌లో పొందుపరుస్తామని వివరించారు. పొందు పరిచిన వివరాల్లో కచ్చితత్వం కోసం జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ సహాయ సాంఘిక సంక్షే అధికారులతో 50మంది వివరాలను ర్యాండమ్‌గా తనిఖీ చేస్తామన్నారు. ఎస్సీ పౌరులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకుని సహకరించాలని కోరారు.